మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



## అనుమానితులు కనిపిస్తే తెలపాలి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

2

సంపుటి : 01 | సంచిక : 194 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 17 జూన్ 2026 | పేజీలు : 2



# 163 ఎకరాల ప్రభుత్వ గైరాన్ భూమి స్వాధీనం

- 20 ఏండ్లుగా కబ్జాలో ఉన్న స్థలాన్ని కాపాడిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా:** బచ్చన్నపేట మండలం సల్వాపూర్ గ్రామంలో ఉన్న సుమారు 163 ఎకరాల ప్రభుత్వ గైరాన్ భూమిని జనగామ జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చింది. సర్వే నంబర్ 147లో ఉన్న ఈ భూమి ప్రజా ఉమ్మడి గైరాన్ భూమిగా రికార్డుల్లో ఉన్నప్పటికీ, గత రెండు దశాబ్దాలుగా మోసపూరిత దస్తావేజులు, అక్రమ ఉత్తర్వుల ద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న సుమారు 84 ఎకరాల భూమిని పంచనామా ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం భూమి ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చింది. జిల్లా యంత్రాంగం విచారణలో, మూల సెటిల్‌మెంట్ రికార్డుల్లో ఈ భూమి గైరాన్ భూమిగా నమోదై ఉండగా, హక్కులేని వ్యక్తులు రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజుల ఆధారంగా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు నిర్ధారణ అయింది. అనంతరం మ్యుటేషన్లు చేసి పట్టాదారు పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు పొందినట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు చట్టబద్ధత కల్పించేలా గతంలో జారీ చేసిన ఉత్తర్వు ద్వారా ప్రభుత్వ భూమిని ప్రైవేటు పట్టా భూమిగా పరిగణించి, నిషేధిత జాబితా నుంచి తొలగించి వ్యవసాయేతర అవసరాలకు మార్పిడి చేసినట్లు వెల్లడైంది. అయితే అలాంటి మార్పిడి చేసే అధికారం కలెక్టర్‌కు లేదని, ఆ ఉత్తర్వు హైకోర్టు ఆదేశాలకు కూడా విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.

### కలెక్టర్ విచారణతో..

హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమగ్ర విచారణ జరిపి, అన్ని రికార్డులను పరిశీలించి సంబంధిత వర్గాలకు వాదనలు వినిపించే అవకాశం కల్పించారు. అనంతరం జారీ చేసిన ఉత్తర్వులో మొత్తం భూమిని ప్రభుత్వ గైరాన్ భూమిగా నిర్ధారించారు. దీంతో అమ్మకపు దస్తావేజులు, మ్యుటేషన్లు, పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు మొదటి నుంచే చెల్లవని ప్రకటించి, ప్రభుత్వ భూమిపై జారీ చేసిన పట్టాను రద్దు చేశారు. రికార్డ్ ఆఫ్ రైట్స్‌ను సరిచేసి, భూమిని మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చారు. అలాగే ఈ భూమికి సంబంధించిన భవిష్యత్తు రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ భూమి పరిరక్షణ ప్రజా బాధ్యత అని, అక్రమ లేదా మోసపూరిత మార్గాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ ఆస్తులను గుర్తించి తిరిగి ప్రజలకు అందిస్తామని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

## స్కూళ్లలో డ్రాపౌట్లు ఉండొద్దు

- విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలి
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



2 లో







2 లో

## పాము కాటుతో చిన్నారి మృతి

- బచ్చన్నపేట మండలం నారాయణపురంలో విషాదం

# రైళ్లలో పారిపోతున్న దొంగలు

- **అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**
- **వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్**



**వరంగల్, మన చౌరాస్తా :** ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. పరిసరాల్లో గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో జరుగుతున్న అనుమానితుల తనిఖీలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు. ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, గొలుసు లాక్కెళ్లడం వంటి ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు ప్రధాన జంక్షన్లు కావడంతో నేరస్థులు రైలు మార్గాల ద్వారా వచ్చి నేరాలకు పాల్పడి తిరిగి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ తరహా నేరాల నివారణకు సీసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో రెండు బృందాలు వరంగల్ రైల్వే స్టేషన్‌లో, మరో రెండు బృందాలు కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, రైల్వే రక్షణ దళం సహకారంతో విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో ప్రయాణించే అనుమానితులను గుర్తించి, వారి సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత వివరాలతో పాటు వేలిముద్రలు, ఫొటోలు సేకరించి, ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా పోలీసు డేటాబేస్‌తో సరిపోల్చి పరిశీలిస్తున్నామని వివరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారి వివరాలు రికార్డుల్లో ఉంటే వెంటనే గుర్తించి అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్‌పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్, ఎస్ఐ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రైవేట్ స్కూల్ బస్సులకు జరిమానాలు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో జనగామ జిల్లా రవాణా అధికారి ఎం.ఆర్. శిల్ప ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పలు ప్రైవేట్ పాఠశాల బస్సులను గుర్తించి జరిమానాలు విధించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ఫిట్‌నెస్, అవసరమైన పత్రాలు, భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన పరిశీలకుడు విష్ణు దీపక్, సహాయ మోటార్ వాహన పరిశీలకులు శ్వేత, నవిత పాల్గొన్నారు.



## ప్రీప్రైమరీ క్లాసులు షురూ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా మంజూరైన ప్రీప్రైమరీ తరగతులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి రిబ్బన్ కట్ చేసి తరగతులను ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఎం. సునీత మాట్లాడుతూ, చిన్నారుల విద్యాభివృద్ధిలో ప్రీప్రైమరీ విద్య కీలకమని అన్నారు. చిన్న వయసు నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్, సమన్వయ వనరుల వ్యక్తి శ్రీకాంత్, సమగ్ర విద్యా ప్రతినిధి రఘు, వెంకటేశ్వర్లు పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.



## స్కూళ్లలో డ్రాపౌట్లు ఉండొద్దు

**– విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలి**
**– జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జనగామ మండలంలోని ఓబుల్ కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా కార్యక్రమాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాల వయసు పిల్లలందరినీ గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. డ్రాపౌట్లు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలని ఆదేశించారు. అనంతరం వంటగదిని తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమీపంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పాము కాటుతో చిన్నారి మృతి



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పాము కాటుతో చిన్నారి మృతి చెందిన సంఘటన బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామంలో జరిగింది. రాత్రి ఇంటి ఆవరణలో తల్లిదండ్రుల మధ్య నిద్రిస్తున్న చిన్నారి మధుస్మిత ను పాము కాటేసింది. వెంటనే పాపా తల్లిదండ్రులకు తెలియజేయడంతో జనగామ, హైదరాబాద్ ఆసుపత్రులకు తరలించగా కన్ను మూసింది. ఆడుతు, పాడుతు మంచిగా చదువుకుంటూ ఉన్న పాప చనిపోవడంతో ఒక్కసారిగా తల్లిదండ్రులు తీవ్ర దుఃఖానికి లోనయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నారి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, ఆ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ భావోద్వేగభరితమై సర్పంచ్ పరిదే స్వప్న శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి, మాసాపేట రవీందర్ రెడ్డి, జంగిటి నరేష్, మిగతా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## 'నెల్లుట్ల' ఫౌండేషన్ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 20న నిర్వహించనున్న నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు 70వ (సప్తతి) జన్మదిన వేడుకలు, నెల్లుట్ల ఫౌండేషన్ 7వ వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను జనగామలో మంగళవారం ప్రముఖ వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ.. రవీందర్ రావు ఫౌండేషన్ ద్వారా సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.. రవీందర్ రావు జీవిత ప్రస్థానం, ఫౌండేషన్ ప్రగతిపై రూపొందించిన ప్రత్యేక సావనీర్‌ను ఆ వేడుకల్లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే, ఈ కార్యక్రమంలో నెల్లుట్ల రవీందర్ రావుకు ఎన్టీఆర్ పురస్కారం అందజేస్తారని, వివిధ రంగాలకు చెందిన 10 మంది ప్రముఖులకు జీవిత సాఫల్య, విశిష్ట పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక సంగీత విభావరి (మ్యూజికల్ నైట్) కూడా ఉంటుందని తెలిపారు. ఈనెల 20 (శనివారం) సాయంత్రం 4 గంటలకు స్థానిక భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లుట్ల రవీందర్ రావు, జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమ నర్సింహాచారి, పాలమాకుల జితేందర్, బత్తిని ఆశోక్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

